'శాంసంగ్' కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్ : తమిళనాడు మద్రాస్ శాంసంగ్‌లో పని చేస్తున్న కార్మికులు తమ న్యాయమైన డిమాండ్ల కోసం సమ్మె చేస్తున్నా యాజమాన్యం పట్టించుకోలేదని వెంటనే ప్రస్తుతం పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసులు రెడ్డి, మనోహర్, కోశాధికారి లక్ష్మీదేవి ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. కంపెనీలో 2000 మంది కార్మికులు పనిచేస్తున్నారని, వారిలో 1450 మంది సిఐటియు సభ్యత్వం కల్గి ఉన్నారన్నారు. న్యాయమైన డిమాండ్ల సాధన కోసం సమ్మె చేస్తుంటే యాజమాన్యం పట్టించుకోకపోవడం దుర్మార్గమని పేర్కొన్నారు. సౌత్ కొరియా కంపెనీ యాజమాన్యం మన దేశంలో, మన రాజ్యాంగానికి అనుకూలంగా ఉండాల్సిన ఉంటుంది యాజమాన్యం, రాజ్యాంగానికి వ్యతిరేకంగా వ్యవహరించడం దారుణమన్నారు. కార్మిక హక్కులు కాలరాస్తున్న శాంసంగ్ యాజమాన్యాన్ని చర్యలు తీసుకుని సమ్మె చేస్తున్న కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని తెలిపారు.

వంటింట్లో ధరల మంట

- చుక్కల్లో కూరగాయలు, నిత్యావసర ధరలు
- అల్లాడుతున్న పేద, మధ్య తరగతి ప్రజలు
- ప్రకృతి వైపరీత్యమే కారణమంటున్న అధికారులు

ప్రజాశక్తి - కడప అర్బన్/వేంపల్లె/పులివెందుల టౌన్

పండగ వేళ నిత్యావసరాలు, కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. సామాన్యుడు ఏదీ కొనలేని పరిస్థితి. ఏ దుకాణానికి వెళ్లినా ధరల భారం తప్పడం లేదని మహిళలు వాపోతున్నారు. పండగ వేళ నిత్యావసరాలు, కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. సామాన్యుడు ఏదీ కొనలేని పరిస్థితి. ఏ దుకాణానికి వెళ్లినా ధరల భారం తప్పడం లేదని మహిళలు వాపోతున్నారు. దేవుడికి దీపం వెలిగించే నువ్వుల నూనె నుంచి వంట నూనెల ధరలు కంపెనీనిబట్టి కిలోకు రూ.20 నుంచి రూ.40 వరకు పెరిగాయి. గత నెలలో కిలో తెల్లగడ్డలు రూ.300 ఉంటే ప్రస్తుతం రూ.360కి పెరిగాయి. చిల్లర దుకాణాల్లో కిలో రూ.400 వంతున అమ్ముతున్నారు. వివిధ రకాల పప్పుల మీద కిలోకి రూ.20 నుంచి రూ.40 వరకు ధరలు పెరిగిపోయాయి. బియ్యం కూడా భారీగా పెరిగాయి. మేలు రకం బియ్యం 25 కిలోల రూ.1700 నుంచి రూ.1850 పెరిగాయి. టమోటా, ఉల్లి ధరలు కూడా పెరగడంతో సామాన్యుడికి మరింత భారమవుతోంది. ప్రభుత్వం రాయితీలు ఇచ్చి నిత్యవసర సరుకులు, కూరగాయల సరఫరా చేసి ఆదుకోవాలని మహిళలు కోరుతున్నారు.

కూరగాయల విషయానికి వస్తే వారానికి సరపడ కూరగాయలు మార్కెట్లో కొనాలంటే కనీసం రూ.500 ఖర్చు చేయనిదే కూరగాయలు బుట్టనిండడం లేదు. ఎర్రగడ్డలు, టమోట ధరలు ఆకాశానంటే పరిస్థితులు చూస్తున్నాం. నాణ్యతను కిలో బట్టి రూ.50 నుంచి రూ.80 వరకు ఎర్రగడ్డలు, టమోటాలు ధరలు పలుకుతున్నాయి. ధరలు నియంత్రణ లేకపోవడానికి కారణం అతివృష్టి, అనావృష్టి అని వ్యవసాయశాఖ, మార్కెటింగ్ అధికారులు చెబుతున్నారు. విజయవాడ లాంటి ప్రాంతాలలో వరదలు వస్తే, రాయలసీమలో, అందులో కడప జిల్లాకు వస్తే అనావృష్టి పరిస్థితులు కనిపిస్తున్నాయి. వాతావరణశాఖ రాష్ట్రంలో వాయుగుండం కారణంగా భారీవర్షాలు పడుతాయని చెప్పినప్పుడు మాత్రమే కడపలో చిన్నపాటి వర్షం పడి మమా అనిపిస్తుంది. అంతకుమించి వర్షాలు పడిన దాఖలాలు లేవు. దీంతో కూరగాయలు సాగు పూర్తిగా ఆటకెక్కింది. బోరుబావుల కింద అంతో ఇంతో పండుతున్నాయి. బహిరంగ మార్కెట్లో కూరగాయల ధరలు పరిశీలిస్తే కిలో.. ఎర్రగడ్డలు రూ.50, టమోట రూ.50, బంగాళదుంపలు రూ.45, బీన్స్ రూ.80, క్యారెట్ రూ.45, చామగడ్డలు రూ.80, మునగకాయలు రూ.60, చిక్కుడు కాయలు రూ.60, బీరకాయలు రూ.40, అనపకాయలు రూ.45, అలసందలు రూ.50, కాకర కాయలు హైబ్రీడ్ రూ. 35, నాటువి రూ. 45, దొండకాయలు రూ.40, ముల్లంగి రూ.40, క్యాప్సికం రూ. 55, బీట్‌రూట్

రూ.30, కిరకాయ రూ. 50, అల్లం రూ.60, క్యాలీఫ్లవర్ రూ.45, క్యాబేజి రూ. 50, వంకాయలు రూ.20, బెండకాయలు రూ.20, మట్టికాయలు రూ.20, సొరకాయ రూ.30, బజ్జిమిరపకాయలు రూ.50 ధరలు పలుకుతున్నాయి. కూరగాయల ధరలు అదుపు చేయాలని పేద, మధ్య తరగతి ప్రజలు కూటమి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

కొనలేకున్నాం....తినలేకున్నాం

కూరగాయల ధరలు రోజురోజుకు పెరిగిపోతూ ఉండడంతో ఎక్కువ ధరలు పెట్టి కొనలేకున్నాం. బువ్వ తినలేకున్నాం. కూరలు చేసుకోవాలంటే కచ్చితంగా ఎర్రగడ్డలు, టమోటాలు ముఖ్యం. వీటి ధరలు అమాంతం పెరిగిపోతూ ఉన్నాయి. పాలకులు ధరలను నియంత్రించి పేదలను ఆదుకోవాలి.

- పావని, ఇందిరానగర్, కడప.

ధరలను నియంత్రించాలి

కూరగాయల ధరలను రాష్ట్ర ప్రభుత్వం నియంత్రించాలి. ఎర్రగడ్డలు, టమోటా రైతు బజార్‌లో సబ్సిడీకి అందజేయాలి. దళారీ వ్యవస్థను నిర్మూలించాలి. పేదల ఆదాయం పెరగడం లేదు. ధరలు మాత్రం ఆకాశాన్ని అందుతున్నాయి. ధరల నియంత్రణకు ప్రత్యేక నిధి కేటాయించాలి.

- రాజామణి, బాలాజీ నగర్, కడప.

పేదలు ఎలా బతకాలి?

నిత్యావసరాల ధరలు పెరిగిపోతుంటే పేదోళ్లు ఎలా బతకాలి. హోల్‌సేల్ మార్కెట్‌లోనూ ధరలు పెరిగాయి. ఇక వీధుల్లో ఉండే దుకాణ యజమానులు ధరలు భారీగా పెంచి అమ్ముతున్నారు. కూరగాయల ధరలు కూడా అమాంతంగా పెరిగాయి. ప్రభుత్వం పేదలను దృష్టిలో ఉంచుకుని ధరలు తగ్గించే మార్గాలు ఆలోచించాలి.

- ఉమాదేవి, గృహిణి, పులివెందుల

సబ్సిడీలు, ఇన్సూరెన్స్ కల్పించి ప్రోత్సహించాలి

రైతులకు పండించే పంటలకు ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీలు, ఇన్సూరెన్స్, కూరగాయలు పండించే రైతులకు కూడా కల్పించాలి. ధరల నియంత్రణకు ఎలాంటి చర్యలు లేవు. పంటలు బాగా పండిన సమయంలో వాటిని నిల్వ చేసుకునేందుకు సరైన శీతల గిడ్డంగులు అందుబాటులో లేవు. దీనివల్ల కూరగాయల ధరలు రోజురోజుకు అవకాశాన్ని అంటుతున్నాయి. ప్రభుత్వం సబ్సిడీ ఇచ్చి పేద కుటుంబాలను ఆదుకోవాలి.

- దస్తగిరిరెడ్డి, జిల్లా కార్యదర్శి, ఎపి రైతు సంఘం.

'గండికోట' నిర్వాసితులకు

భూమి, ప్యాకేజీ అమలు చేయాలి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - ముద్దనూరు

గండికోట జలాశయం ప్రాజెక్టు కింద ముంపునకు గురైన గ్రామాల ప్రజలకు భూమి, ప్యాకేజి పరిహారం అమలు చేయాలని సిపిఎం కార్యదర్శి వర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు, సిపిఎం జిల్లా కార్యదర్శి జి. చంద్రశేఖర్ అన్నారు. మండలం లోని కొత్త చౌట్టిపల్లె, శెట్టివారిపల్లె గ్రామాలను మంగళవారం సిపిఎం బృందం పర్యటించింది. గండికోట జలాశయం మునక ప్రాంత బాధిత ప్రజలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ముద్దనూరు ఆర్అండ్‌బి అతిధి గృహంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ జమ్మలమడుగు నియోజకవర్గంలోని కొండాపురం, ముద్దనూరు మండలాల్లో ముంపునకు గురైన 22 గ్రామాల నిర్వాసిత ప్రజలకు పెండింగ్‌లో ఉన్న ముంపు పరిహారాన్ని చెల్లించాలని డిమాండ్ చేశారు. భూములు, ఇల్లు, పశువులు, దిబ్బలు, గడ్డి కళాలు, స్వగ్రామాలను జలాశయం కోసం సర్వస్వం త్యాగం చేశారన్నారు. కేవలం 14 గ్రామాల నిర్వాసితులకు మాత్రమే అంతంత మాత్రం పరిహారం ఇచ్చారన్నారు. 2013 ఆర్ఆర్ ప్యాకేజీ ప్రకారం ఎకరాకు మూడు ఎకరాల భూమి, పాత ఇంటికి, కొత్త ఇల్లు నిర్మాణాలకు స్థలం, రోడ్లు, కరెంటు, పాఠశాల, ఆసుపత్రులు వంటి కనీస మౌలిక సౌకర్యాలు కల్పించాలన్నారు. ఇంటి నిర్మాణానికి 17 లక్షలు ప్యాకేజీ ఇవ్వాల్సి ఉందన్నారు. ఆర్ఆర్ ప్యాకేజీ ప్రకారం 20 ఏళ్లుగా దాదాపు 20వేల మంది నిర్వాసితులకు ఇప్పటివరకు ఇవ్వలేదని ఆరోపించారు. ఒక తరం కూడా మారుతోందని ఎద్దేవ చేశారు. స్థానికేతరులు మునక ప్రాంత ప్రజలకు ఇవ్వాల్సిన వందలాది ఎకరాల ప్రభుత్వ భూములను ప్రధాన అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన రాజకీయ నాయకులు, వారి అనుచరులు, కొందరు అనర్హులు ఆక్రమించుకున్నారన్నారు. భూములకు పట్టాలు

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న వి.వెంకటేశ్వర్లు

పొంది అనుభవిస్తున్నా అధికారులు కళ్ళు అప్పగించ్చి చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని వాపోయారు అధికారులు ఎలాంటి చట్టబద్ధమైన చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యంగా ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారుల అవినీతికి బొజ్జంగా ఈ రెండు మండలాలు మారాయయన్నారు. అవన్నీ రద్దుచేసి అర్హులైన నిర్వాసితులకు చట్టబద్ధంగా ఆర్ఆర్. ప్యాకేజీ ప్రకారం చెల్లించాలని, పెండింగులో ఉన్న ప్యాకేజీని కూడా చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. లేకుంటే పెద్ద ఎత్తున నిర్వాసిత ప్రజలతో కలిసి సిపిఎం ప్రజా ఉద్యమాన్ని తీసుకొస్తుందన్నారు. కలెక్టరేట్ ఎదుట నిరవధిక నిరాహార దీక్షలు చేస్తామన్నారు. నిర్వాసిత ప్రజలతో భూ సాధన కమిటీలు ఏర్పాటు చేసి గ్రామ గ్రామాన నిర్వాసితులను కదిలించి ప్రారంభిస్తుందని హెచ్చరించారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.మనోహర్, జి. శివకుమార్, జిల్లా కమిటీ సభ్యులు వి.అన్వేష్, బి.దస్తగిరి రెడ్డి, జమ్మలమడుగు ప్రాంత సిపిఎంనాయకులు ఏసుదాసు, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వి.శివకుమార్, సిఐటియు నాయకులు విజయ్, శేఖర్ పాల్గొన్నారు.

14 నుంచి పంచాయతీ వారోత్సవాలు

వీడియో కాన్ఫరెన్సులో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

ప్రజాశక్తి - కడప

ఈనెల 14 నుంచి 20 వరకు నిర్వహించబోయే పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలను విజయవంతం చేయాలని, అలాగే జిల్లాల్లో గ్రామ సభల్లో ఆమోదిందించిన సిమెంట్ రోడ్లు, బి.టి రోడ్లు, మేకలు, గొర్రెలు,కోళ్ళ పెంపకం షెడ్లు వంటి ఉపాధి హామీ మేటీరియల్ కాంపోనెంట్ పనులను వచ్చే సంక్రాంతి లోపల పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ శివ శంకర్ లోతేటి ఆదేశించారు. మంగళవారం రాజధాని అమరావతి నుంచి ఉపాధి హామీ పనులు, గ్రామ సభలు, పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలు తదితర అంశాలపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కార్యక్రమానికి కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుండి కలెక్టర్‌తోపాటు సంబంధిత జిల్లా అధికారులు హాజరయ్యారు. విసి ముగిసిన అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గ్రామసభల్లో ఆమోదం పొందిన 983 అన్ని పనులకు వందశాతం అనుమతి చేశామన్నారు. ఉపాధి హామీ మేటీరియల్ కాంపోనెంట్ పనులకు సంబంధించి అప్లోడ్ విషయంలో ఎలాంటి టెక్నికల్ ఇష్యూస్ లేవని తెలిపారు. 14వ ంండి 20 వరకు చేపట్టబోయే 'పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలలో' జిల్లాలోని ప్రజాప్రతినిధులు సమన్వయం చేసుకొని ఆమోదం పొందిన పనులకు భూమి పూజలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో డ్వామా పీడీ విజయకుమార్, పంచాయతీ రాజ్ ఎసి శ్రీనివాస రెడ్డి, జడ్‌పి ఇసిఒ సుధాకర్ రెడ్డి, గనులు భూగర్భ శాఖ ఆర్ఐ. విమలమ్మ, డిపిఒ రాజ్యలక్ష్మి ఆర్.డబ్ల్యూ ఎస్ అధికారులు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

సాగునీటి సంఘాల ఏర్పాటుకు ఎన్నికలు .. జిల్లాలో సాగునీటి వినియోగదారుల సంఘాలకు పటిష్టంగా ఎన్నికలను నిర్వహిస్తామని ెలెక్టర్ శివ శంకర్ లోతేటి రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామా నాయుడుకు నివేదించారు. విజయవాడ నుంచి రాష్ట్రంలోని పెద్ద, మధ్య, చిన్న తరహా నీటి పారుదల కింద ఉన్న సాగు నీటి వినియోగదారుల సంఘాలకు ఎన్నికలు నిర్వహించే ప్రక్రియపై జిల్లా కలెక్టర్లతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వ హించారు. స్థానిక కలెక్టరేట లోని బోర్డ్ మీటింగ్ హాల్ నుంచి కలెక్టర్‌తోపాటు జెసి, డిఆర్ఒ, జలవనరుల శాఖ అధికారులు హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా పరిధిలో 206 పెద్ద, మధ్య, చిన్న తరహా నీటి సంఘాలు ఉన్నాయని అన్నారు. ఈనెల 14 నుంచే నీటి సంఘాల ఎన్నికల ప్రక్రియ ను ప్రారంభించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఎలాంటి లోటుపాట్లకు తావివ్వరదని అన్నారు.

వేంపల్లె : వెలవెల పోతున్న కూరగాయల మార్కెట్

మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

కరిముల్లా హిపాజతుల్లా మేరీ ప్రసన్న

విద్యా వ్యవస్థలో భాగంగా ఉన్న మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని యుటిఎఫ్ కడప కార్పొరేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కరిముల్లా, హిపాజతుల్లా తెలిపారు. కడప యుటిఎఫ్ కార్పొరేషన్ సమావేశం యుటిఎఫ్ భవన్‌లో హిపాజతుల్లా అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రమోషన్లు, బదిలీలు రెగ్యులర్‌గా జరగడం లేదని, ఎప్పుడు నిర్వహిస్తారో తెలియని పరిస్థితి ఉందని తెలిపారు అనంతరం యుటిఎఫ్ కడప కార్పొరేషన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా సి.లింగారెడ్డి, అధ్యక్షులుగా ఎల్. కరిముల్లా, సహాధ్యక్షులుగా బాల భాస్కర్, ఎం.పుష్పకుమారి, ప్రధాన కార్యదర్శిగా పి. హిఫాజతుల్లా, ట్రెజరర్‌గా యన్. మేరీ ప్రసన్న, జిల్లా కౌన్సిలర్లుగా పి.హిపాజతుల్లా, ఎల్. కరిముల్లా, డి.రూతు ఆరోగ్య మేరీ, కె.మోహన రావు, మండల కార్యదర్శిగా షేక్. మొహమ్మద్ ఆసిఫ్, ఒ.మరియరాణి, పి.రెడ్డి లక్ష్మీప్రసన్న, మృదుల, ఎ.గంగరాజు, ఆడిట్ కమిటీ కన్వీనర్ పి.డేవిడ్, వినయ్ కుమార్, సభ్యులుగా ఎం.సుమతి, ఎం. ఆసిఫ్ అహ్మద్ ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ ప్రభాకర్, పరిశీలకులుగా కార్యదర్శి శ్రీనివాసులు వ్యవహరించారు.

కాంగ్రెస్‌లో నూతనోత్సాహం : డిసిసి

ప్రజాశక్తి - కడప

రెండు రాష్ట్రాల్లో నిర్వహించిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మెరుగైన ఫలితాలు సాధించాయని, దేశ ప్రజలు రాహుల్ గాంధీ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఎన్. డి. విజయ జ్యోతి అన్నారు. దేశవ్యాప్తంగా ప్రజలు కాంగ్రెస్ వైపే ఉన్నారని జమ్మూ కాశ్మీర్, హర్యానా ఎలక్షన్ ఫలితాలు చూస్తే అర్థమవుతుందని తెలిపారు. జమ్మూకాశ్మీర్, హర్యానా రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ మెరుగైన ఫలితాన్ని సాధించడంతో జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం కాంగ్రెస్ శ్రేణులు స్వీట్లు పంచుకుని సంబరాలు జరుపుకున్నారు. ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విజయ జ్యోతి మాట్లాడుతూ ఎన్నికల్లో ఓట్ల శాతం పెరిగింది అన్నారు. రాబోవు మూడు రాష్ట్రాల ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీ మరింత మెరుగైన ఫలితాలు సాధిస్తుందని ఆమె ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న వారు పిసిసి మాజీ ఉపాధ్యక్షులు బండి జకరయ్య, పిసిసి మాజీ ప్రధాన కార్యదర్శి, అబ్దుల్ సత్తార్, పిసిసి మాజీ కార్యదర్శి సిరాజుద్దీన్, ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా బాధ్యులు డాక్టర్ శ్రీనివాసులు, రాష్ట్ర యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు సుశీల్ కుమార్, చెప్పలి పుల్లయ్య, విజయ కుమార్, సుబ్బారెడ్డి, మైనుద్దీన్, రవీంద్రారెడ్డి, జయ సుబ్బారెడ్డి, గంగయ్య పాల్గొన్నారు.

మల్లికార్జున స్వామి ఆలయంలో హోమం

ప్రజాశక్తి-చెన్నూరు : స్థానిక ట్రంకు రోడ్డులో వెలసిన శ్రీ లలితా మల్లికార్జున స్వామి ఆలయంలో మంగళవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో హోమం నిర్వహించారు. గత నెలలో ఘనంగా జరిగిన ధ్వజస్తంభ, నవగ్రహాల విగ్రహాలను ప్రతిష్టించారు. మంగళవారానికి 41 రోజులు కావడంతో విశిష్టంగా ఆలయంలో హోం నిర్వహించారు. దాతలు ద్వారా సేకరించిన రూ. 34 లక్షల విరాళంతో ఆలయానికి నూతన శోభ సంతరించుకునేలా ఆలయ కమిటీ నిర్మాణం చేపట్టారు అనంతరం ప్రజలకు అన్నదానం చేశారు.

విద్యార్థులకు బహుమతులు ప్రదానం

ప్రజాశక్తి - కడప అర్బన్

బహుమతి అందజేస్తున్న డిఇఒ, నోడల్ అధికారి

కెఎస్ఆర్ ం ఇస్రో స్పేస్ వీక్ సందర్భంగా 36 మండలంలోని స్కూల్స్ విద్యార్థిని, విద్యార్థులకు వ్యాసరచన వక్తృత్వ పోటీలు నిర్వహించి గెలుపొందిన ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల విద్యార్థులకు ప్రదానం చేశారు. ముఖ్య అతిధులుగా డిఇఒ యం.అనురాధ, నోడల్ అధికారి టి.వి. రమణయ్య, ఇస్రో ఎస్‌డిఎసి షార్ జిఎం ఎ. బాలమురళి, జనరల్ మేనేజర్, డిప్యూటీ జిఎం ఎస్. రెడ్డియా విద్యార్థులు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ వి ఎస్ ఎస్ మూర్తి, కల్చరల్ కో-ఆర్డినేటర్ డాక్టరు వీర శంకర్, ఎన్ ఎస్ ఎస్ కో-ఆర్డినేటర్ సురేష్ బాబు, ఇసిఇ డిపార్ట్ మెంట్ కో-ఆర్డినేటర్ ఎం. ప్రభాకర్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

హోరాహోరీగా క్రికెట్ పోటీలు

ప్రజాశక్తి - కడప : జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎసిఎ అండర్- 14 ప్లేట్ గ్రూప్ అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నమెంట్ హోరాహోరీగా సాగుతున్నాయి. వైఎస్ రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో జరిగిన మ్యాచ్ లో ఈస్ట్ గోదావరి జట్టుపై ఇన్నింగ్స్ 117 పరుగుల తేడాతో విశాఖపట్నం జట్టు ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో మొదటి ఇన్నింగ్స్‌లో ఈస్ట్ గోదావరి జట్టు 259 పరుగులు చేసింది. రెండు వికెట్ల నష్టానికి 112 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో చివరి రోజు బ్యాటింగ్ ప్రారంభించిన విశాఖపట్నం జట్టు మొదటి ఇన్నింగ్స్ లో మూడు వికెట్ల నష్టానికి 426 పరుగులు చేసి డిక్లేర్ ప్రకటించింది. ఆ జట్టులోని ఎస్. రామ్ చరణ్ 133 పరుగులు (సెంచరీ) చేశాడు. మరో బ్యాట్స్మెన్ పి. వినోద్ 177 పరుగులు (సెంచరీ) చేసి నాటౌట్ గా నిలిచాడు. ఈస్ట్ గోదావరి జట్టులోని మనీ వర్ధన్ రెండు వికెట్లు తీసుకున్నాడు. అనంతరం రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన ఈస్ట్ గోదావరి జట్టు 34.0 ఓవర్లలో 50 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయి ఓటమి చెందింది. విశాఖపట్నం జట్టులోని ప్రఖ్యాత్ వర్మ 5, పి వినోద్ 2 వికెట్లు తీసుకున్నారు.

మహిళలకు ఆపన్న హస్తం వన్ స్టాప్ సెంటర్

ప్రజాశక్తి - కడప

ఆపదలో ఉన్న మహిళలకు ఆపన్న హస్తం వన్ స్టాప్ సెంటర్ (సఖి) అని, ఒకే చోట అనేక సేవలు లభిస్తాయని సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ అన్నారు. మంగళవారం కడప నగరం రిమ్స్ ఆవరణంలోని వన్ స్టాప్ సెంటర్ ను(సఖి) జడ్జి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్న మహిళలు వన్ స్టాప్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఒకే చోట అనేక సేవలు ఉన్నాయని చెప్పారు. తెలిపారు. వన్ స్టాప్ సెంటర్ లోని రిజిస్టర్లను జడ్జి పరిశీలించారు. వన్ స్టాప్ సెంటర్లో అత్యవసర స్పందన, చట్టపరమైన సలహాలు, పోలీస్ సహాయం ,మానసిక సలహాలు, వీడియో కాన్ఫరెన్స్, వైద్య సహాయం, తాత్కాలిక ఆశ్రయం లాంటి సేవలు ఉంటాయి అని తెలిపారు. గృహహింస, అత్యాచారాలు, లైంగిక వేధింపులు, యాసిడ్ దాడులు, మహిళల అక్రమ రవాణా, బాలలపై లైంగిక వేధింపులు , బాల్య వివాహాలు, కిడ్నాప్లు , సైబర్ నేరాలు, వరకట్న వేధింపులు , వరకట్న మరణాలు వంటి సందర్భాలలో మహిళలు సంప్రదించవచ్చు అని అన్నారు. కార్యక్రమంలో వన్ స్టాప్ సెంటర్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ అశ్విని, సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్ఆర్ జిల్లా పేరు మారిస్తే ఉద్యమిస్తాం

ప్రజాశక్తి - కడప : వైఎస్ఆర్ జిల్లాగా 2010లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసింది, ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఆ పేరు మార్చాలని చూస్తోందని, అలా చేస్తే ఉద్యమిస్తామని వైసిపి జిల్లా అధ్యక్షులు పి. రవీంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. వైఎస్ఆర్ జిల్లా పేరును మళ్లీ కడప జిల్లాగా పేరు మార్చాలని పక్క జిల్లాలో ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి మాట్లాడటం హేయమైన చర్య అని అన్నారు. అంశం పై ముఖ్యమంత్రి కి లేఖ రాయడం విడ్డూరం అని అన్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి ఉమ్మడి ఆంధ్ర రాష్ట్రంలో ఆయన చేసిన సేవలు వెల కట్టలేనివి అని చెప్పారు. ఆయనకు గుర్తింపుగా కడప జిల్లాకు వైఎస్ఆర్ జిల్లా అని నామకరణం చేశారన్నారు. అప్పట్లో టిడిపి వ్యతిరేకించలేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా ఆ ఆలోచన మానుకోవాలని మంత్రి సత్యకుమార్‌ను కోరుతున్నామన్నారు. సమావేశంలో వైసిపి నాయకులు పులి సునీల్ కుమార్, పాక సురేష్, బాలస్వామి రెడ్డి పాల్గొన్నారు.

ఇఒపిఆర్‌డిగా వెంకటసుబ్బారెడ్డి

ప్రజాశక్తి-చింతకొమ్మదిన్నె : మండల ఇఒపిఆర్‌డిగా వెంకటసుబ్బారెడ్డి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో ఖాజీపేట మండలంలో ఇఒపిఆర్‌డిగా పనిచేస్తూ బదిలీపై మండలానికి వచ్చారని తెలిపారు. గతంలో ఇక్కడ ఇఒఆర్‌డిగా ఉన్న శ్రీధర్ వల్లూరు మండలానికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా నూతన ఇఒపిఆర్‌డి మాట్లాడుతూ పంచాయతీల్లో సమస్యలు ఉంటే తమ దృష్టికి తెస్తే పంచాయతీ కార్యదర్శితో మాట్లాడి పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

ఎంపిడిఒను సన్మానిస్తున్న టిడిపి నాయకులు

గోపవరం ఎంపిడిఒగా రామనాథ్‌రెడ్డి

ప్రజాశక్తి -గోపవరం

మండల ఎంపిడిఒగా రామనాథ్‌రెడ్డి మంగళవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో బాధ్యతలను స్వీకరించారు. టిడిపి ముఖ్య నాయకులైన కాలువ పల్లె సర్పంచ్ శ్రీనివాసులు, మండల ఉపాధ్యక్షులు రామ్మోహన్‌రెడ్డి, జిల్లా పార్లమెంటు రైతు కమిటీ కార్యదర్శి పళ్లెం ఎల్లారెడ్డి రామ సుబ్బారెడ్డి, రామానాయుడు మరికొందరు నూతన ఎంపిడిఒను మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలను తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ మండల అభివృద్ధికి అహర్నిశలు శ్రమించాలన్నారు. తెలుగుదేశం పార్టీ హయాంలో ప్రతి గ్రామానికి మౌలిక సదుపాయాలను కల్పించాలన్నారు. అర్హులైన వారందరికీ ప్రభుత్వ పథకాలను అందించేందుకు ముమ్మర ప్రయత్నాలు చేయాలన్నారు. అనంతరం ఎంపిడిఒ రామనాథ్‌రెడ్డి మాట్లాడుతూ మండల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తామని నాయకులకు హామీ ఇచ్చారు.

అందుబాటులో ఎరువులు : ఎఒ

ప్రజాశక్తి - కడప అర్బన్ : రబీ 2024-25 సీజన్‌కి జిల్లాలో ఎరువులను రైతులకు అందుబాటులో ఉంచామని వ్యవసాయ అధికారి నాగేశ్వరరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. యూరియా 6,419.67 మెట్రిక్ టన్నులు, డిఎపి 1,935.6 మెట్రిక్ టన్నులు, ఎంఒపి-2,015.44 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్సెస్ 17,042.02 మెట్రిక్ టన్నులు, ఎస్ఎస్‌పి 1,801.6 మెట్రిక్ టన్నులు వివిధ రకాల ఎరువులను వ్యవసాయశాఖ వారు రైతు సేవ కేంద్రాలు, ప్రయివేట్ డీలర్ల వద్ద అందుబాటులో ఉంచారని తెలిపారు.15 రోజుల్లో అదనంగా 8,200 మెట్రిక్ టన్నుల యూరియా, 2,500 మెట్రిక్ టన్నుల డిఎపి నిల్వలు జిల్లాకు వచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. రానున్న రబీ సీజన్‌కు ఎటువంటి ఎరువుల కొరత లేదని తెలిపారు.

ప్రభుత్వ సూచన మేరకే దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - సిద్ధవటం : రాష్ట్రంలో నూతన మద్యం పాలసీపై మద్యం దుకాణాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని ఇందులో ఎటువంటి అపోహలు ఉండవని అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవి పేర్కొన్నారు. మంగళవారం సిద్ధవటం ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో దరఖాస్తుదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో నూతన మద్యం పాలసీపై,8 మద్యం దుకాణాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని పేర్కొన్నారు. మద్యం పాలసీపై రాష్ట్ర ప్రభుత్వ సూచనల మేరకే దరఖాస్తులు తీసుకుంటున్నామని అట్లూరు 1, ఒంటిమిట్ట 2, సిద్ధవటం 5 మద్యం దుకాణాలకు దరఖాస్తులు అందాయని చెప్పారు. కొంతమంది సిద్ధవటంలో మద్యం దుకాణాలపై సలహాలు అడిగారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సిఐ రాజశేఖర్, మద్యం షాపుల దరఖాస్తుదారులు పాల్గొన్నారు.

అధికారులు రైతులకు అందుబాటులో ఉండాలి

ప్రజాశక్తి - కమలాపురం టౌన్ : వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది రైతులకు అందుబాటులో ఉంటూ అధికదిగుబడి కోసం వారికి సలహాలు, సూచనలు ఇవ్వాలని ఎమ్మెల్యే కృష్ణ చైతన్యరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని చిన్న చెప్పలి గ్రామ పంచాయతీలో విత్తన పంపిణీ, పొలం పిలుస్తోంది కార్యక్రమాలకు హాజరయ్యారు. స్థానిక రైతు పొలంలో సాగు చేసిన బత్తాయి పంటలో, అంతర పంటగా సాగు చేసిన మినుము పంటను అధికారులు, రైతులతో కలిసి పరిశీలించారు. అర్హులైన రైతులకు 25 శాతం సబ్సిడీతో బుడ్డ శనగ విత్తనాలను అధికారులతో కలిసి పంపిణీ చేశారు. సాంకేతిక వినియోగ కార్యక్రమంలో భాగంగా డ్రోన్ పరికరాన్ని ఎలా ఉప యోగించాలో అధికారులు రైతులకు వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు అందుబాటులో ఉండాలని, ఏదో మొక్కుబడిగా కాకుండా, తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడిని సాధించేలా రైతులను ముందుకు తీసుకువెళ్లాలని తెలియజేశారు. డ్రోన్లను ఉపయోగించి తక్కువ ఖర్చు, తక్కువ సమయంలో, తక్కువ ఎరువులను, పురుగు మందులను అధిక దిగుబడులు సాధించేలా రైతులకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. చిన్న చెప్పలి పంచాయతీకి రూ. 65 లక్షలతో రోడ్లు, డ్రెయినేజీ పనులను మొదలు పెట్టామని, త్వరలో పూర్తి చేస్తామని తెలియజేశారు. రైతులకు ప్రభుత్వ సబ్సిడీ శనగ విత్తనాలను పంపిణీ చేశారు.

స్వార్థ రాజకీయాలకు నిదర్శనం : వైసిపి

ప్రజాశక్తి - కమలాపురం టౌన్ : మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు వారి స్వలాభం కోసమే టిడిపిలో చేరారని వైసిపి కమలాపురం పట్టణ కన్వీనర్ బాలగంగాధర్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ మహమ్మద్ సాదిక్, మారుజోల్ల శ్రీనివాస్ రెడ్డి, వైసిపి కౌన్సిలర్లు తెలిపారు. వారి వల్ల పార్టీకి ఎలాంటి నష్టం లేదన్నారు. అలాంటి వారు ఏ పార్టీలో ఉన్నా చాలా ప్రమాదకరమని తెలియజేశారు. వైసిపి పార్టీ జెండాతో గెలిచి మరో పార్టీలో చేరడం సిగ్గుచేటు అన్నారు. పార్టీకి మోసం చేసి పార్టీ మారే నాయకులు లేకపోవడం పార్టీకి మంచిదేనన్నారు. కౌన్సిలర్లకు వైసిపి టికెట్ ఇచ్చి కార్యకర్తలు, నాయకులు అన్ని విధాల అండగా ఉండి గెలిపిస్తే, ఇలా పార్టీ మారడం వారి స్వార్థ రాజకీయాలకు నిర్దర్శనం అన్నారు. మున్సిపల్ చైర్మన్ మార్పురి మేరీకి, మొదటిసారి చైర్మన్ పదవి ఇచ్చి ఉన్నత స్థానం కల్పించిన పార్టీకి ద్రోహం చేయడం తగునా అన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కార్యకర్తలు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

మత్తుకు బానిసైతే మానసిక సమస్యలు

ప్రజాశక్తి - కడప అర్బన్ : యువత మత్తు పదార్థాలకు బానిసైతే శరీరక, మానసిక సమస్యలు ఎదురవుతాయని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటరాముడు అన్నారు. మంగళవారం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ కడప వారి ఆధ్వర్యంలో ఈ నెల 4 నుంచి 10 తేదీ వరకు నిర్వహించే ప్రపంచ మానసిక వారోత్సవాల్లో భాగంగా నగరంలో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ మున్సిపల్ కార్పొరేషన్ నుంచి సంధ్యా సర్కిల్, ఎర్రముక్కపల్లె సర్కిల్ మీదుగా మహావీర సర్కిల్ వరకు నిర్వహించారు. మానసిక ఆరోగ్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మెడికల్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ జయ భాస్కర్‌రెడ్డి, వైద్యులు డాక్టర్ వంశీకృష్ణ, డాక్టర్ సునీత, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, పిజి మెడిసిన్ విద్యార్థులు, స్వచ్ఛంద సేవా ప్రతినిధులు జూటూరు విజయ్‌కుమార్, వసంత్, సుబ్బయ్య పాల్గొన్నారు.

జలకళను సంతరించుకున్న పైడిపాలెం రిజర్వాయర్

పైడిపాలెం రిజర్వాయర్‌లో 5.5 టిఎంసిల నీరు

గండికోట నుంచి నీరు నిలుపుదల.. కృష్ణా జలాలతో కళకళలాడుతున్న రిజర్వాయర్

ప్రజాశక్తి - సింహాద్రిపురం

పులివెందుల నియోజకవర్గానికి ప్రధాన సాగునీటి వనరైన పైడిపాలెం రిజర్వాయర్ కృష్ణా జలాలతో కళకళలాడుతోంది. రిజర్వాయర్ పూర్తి సామర్థ్యం ఆరు టిఎంసి కాగా ప్రస్తుతం 5.5 టిఎంసి నీరు నిల్వ చేశారు. గండికోట రిజర్వాయర్ నుంచి 39 రోజులపాటు 7 పంపులతో నీటిని పంపింగ్ చేశారు. దాదాపు 2.595 టిఎంసి నీటిని లిఫ్ట్ ద్వారా పైడిపాలెం రిజర్వాయర్‌కు పంపింగ్ చేశారు. రిజర్వాయర్‌లో మరో 0.5 టిఎంసి నీటిని నిలువ చేసే అవకాశం ఉన్నప్పటికీ.. వర్షాకాలం నేపథ్యంలో నీటిని నిల్వ చేయడం లేదని గండికోట లిఫ్ట్ ఇరిగేషన్ డిఇ శ్రీనివాసులు తెలిపారు. గండికోట నుంచి నీటిని లిఫ్టింగ్ ఆపేశామన్నారు. పైడిపాలెం రిజర్వాయర్ జలకళను సంతరించుకోవడంతో పర్యాటకుల సందడి పెరిగింది. అంతేకాక దసరా సెలవులు కావడంతో పిల్లలు, పెద్దలు అధిక సంఖ్యలో రిజర్వాయర్ అందాలను తిలకిస్తున్నారు.

సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్తాం

ప్రజాశక్తి - వేంపల్లె

ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని టిడిపి మండల పరిశీలకుడు రఘునాథ్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో మంగళవారం ఆయన ప్రజా దర్బార్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు తమ సమస్యలను రఘునాథరెడ్డి దృష్టికి తెచ్చారు. వెళ్లడం జరిగింది. సమస్యలను జిల్లా ఉన్నతాధికారుల, పులివెందుల ఇన్‌ఛార్జి బిటెక్ రవి ద్వారా సిఎం దృష్టికి తీసుకెళతామన్నారు. ప్రతిపక్షాలు ప్రభుత్వంపై బురదజల్లేందుకు ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం మండలంలోని ఆయా గ్రామాల టిడిపి కార్యకర్తల సమస్యలు, పార్టీ పటిష్టతపై మండల కన్వీనర్ రామమునిరెడ్డి, టిడిపి ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్, జిల్లా ఉపాధ్యక్షుడు జగన్నాథరెడ్డితో చర్చించారు. టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు రామగంగిరెడ్డి, వేమా కుమార్, తెలంగాణ వలి, డక్కా రమేష్, మహమ్మద్ ఇనాయతుల్లా, శ్రీనివాసులు, గండి దేవస్థానం మాజీ చైర్మన్ వెంకటస్వామి, గోగుల మల్లికార్జున, భాస్కర్ పాల్గొన్నారు.

విద్యుత్ సామగ్రి పంపిణీ జాప్యంపై ధర్నా చేస్తాం

- మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు

ప్రజాశక్తి - చాపాడు

రైతులకు అవసరమైన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, వైర్లు, స్తంభాల సరఫరాలో నెలల తరబడి ఆలస్యం జరుగుతోందని అధికారులు స్పందించకపోతే ప్రజా ప్రతినిధులతో కలిసి కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తామని ఎంపిపి లక్ష్మయ్య హెచ్చరించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సభా భవనంలో మంగళవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఖరీఫ్, రబీ సీజన్‌లో పంటలు సాగు చేసుకోలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. పరికరాల మంజూరులో ఆలస్యం జరుగుతున్న మాట వాస్తవమేనని మండలానికి 26 ట్రాన్స్‌ఫార్మర్లు, 21 కిలోమీటర్ల మేర విద్యుత్ వైర్లు మంజూరు కావాల్సి ఉందన్నారు. వరి రైతులను యూరియా కొరత వేధిస్తోందని సభ్యులు తెలిపారు. బుధవారం 107మెట్రిక్ టన్నులు మండలానికి నిల్వ వస్తుందని ఎఒ మ్యాగీ తెలిపారు. ప్రభుత్వం సరఫరా చేసే సిమెంట్ గడ్డలు కట్టిందని సోమాపురం సర్పంచ్ శ్రీనువాసులరెడ్డి తెలిపారు. ఉపాధి పనులను ఈనెల 14 నుండి పల్లె పండుగ ద్వారా ప్రారంభిస్తామని పిఆర్ డిఈ మధుసూదన్‌రావు తెలిపారు. సమావేశంలో ఇన్‌ఛార్జి ఎంపిడిఒ రామానుజం, డిటి కృష్ణారెడ్డి, ఉప ఎంపిపి శుభకరుణమ్మ, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కాలువలు నిర్మించాలని నేడు సదస్సు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

వామికొండ రిజర్వాయర్ పంట శింబు కాలువలు నిర్మించాలని బుధవారం మండలంలోని చిలమకూరు బ్రహ్మంగారి గుడి వద్ద ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం కడప జిల్లా సమితి ఆధ్వర్యంలో సదస్సు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. సదస్సుకు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం కడప జిల్లా సమితి గౌరవాధ్యక్షులు గాలి చంద్ర, కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు ఇల్లూరి కృష్ణారెడ్డి, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పోతిరెడ్డి భాస్కర్ హాజరవుతారని తెలిపారు. ఆ మేరకు స్థానిక సిపిఐ కార్యాలయంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎంవి సుబ్బారెడ్డి కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గొర్రె ఓబయ్య, ఏసన్న, బాబు పాల్గొన్నారు.

ప్రజల తరపున ప్రశ్నిస్తా : పిఆర్

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పిఆర్

ఎవరు ఎన్ని మాట్లాడినా ప్రజల తరపున తాను ప్రశ్నిస్తానని ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి తెలిపారు. సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని ప్రభుత్వానికి సూచించారు. స్థానికంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ.. తాను భయపడడానికి అమయకపు ఓటరును కాదన్నారు. మీలా మాట్లాడడానికి తనకు సం స్కారం అడ్డు వస్తుందని ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డిని ఉద్దేశించి పిఆర్ పేర్కొ న్నారు. అడిగిన దానికి సమాధానం చెప్పకుండా మాటలతో ఎరిగిపడుతున్నారని తెలిపారు. పైకి మాత్రం ఫ్యాషన్ అంటూ.. మనసులో ఫ్యాక్షన్‌ను రెచ్చగొట్టేలా మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలను భయాందోళనకు చేస్తున్నారని పేర్కొన్నారు. సమావేశంలో పొన్నపు గిరిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

క్రైం కార్నర్

వివాహిత ఆత్మహత్య

ప్రజాశక్తి - చక్రాయపేట

మండలంలోని అద్దాలమర్రి గ్రామంలో తోల్లపల్లె గంగా సుమతి (19) వివాహిత ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ రంగారావు తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్ 12న కదిరి పట్టణానికి చెందిన ప్రశాంత్ అనే అతనితో వివాహమైంది. ఆమె భర్త, అత్త, మామ వేధింపులకు తట్టుకోలేక పుట్టినింటికి వచ్చి సీలింగ్ ఫ్యాన్ కడ్డీకి చీరతో ఉరి వేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మృతురాలు అన్న గురు భాస్కర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు

బిఎన్ తాండాలో యువకుడు..

మండలంలోని ఎర్రగుడి గ్రామం బిఎన్ తాండా గ్రామానికి చెందిన కార్తీక్ నాయక్ (20) ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ రంగారావు తెలిపారు. వివరాల్లోకి వెళితే.. తల్లిదండ్రులు ఇస్లావత్ కృష్ణ నాయక్,అంజనమ్మ ప్రథమ పుత్రుడు కార్తీక్ నాయక్ డిప్లమా చదువుతున్నాడు. సెల్‌లో బెట్టు ఆడి డబ్బు పోగొట్టుకోవడంతో ఆదివారం తల్లిదండ్రులు మందలించారు. ఇంట్లో నుండి అలిగి పోయి తండా సమీపంలో కార్తీక్ నాయక్ ప్యాంటుతో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తెలుగుగంగ కాలువలో పడి బాలుడు మృతి

ప్రజాశక్తి - మైదుకూరు (చాపాడు)

మైదుకూరు మండల పరిధిలోని విశ్వనాథపురం గ్రామానికి చెందిన కొట్టం సుజిత్ (14) అనే బాలుడు తెలుగుగంగ కాలవలో పడి మృతి చెందిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు అందించిన వివరాల ప్రకారం.. బాలుడు గ్రామ సమీపంలోని తెలుగంగ కాలువలో ప్రమాదవశాత్తూ పడ్డాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. బాలుడు మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మైదుకూరు నియోజకవర్గ పరిధిలో గత వారం రోజుల్లోనే నలుగురు పిల్లలు కాలువల్లో పడి మృతి చెందిన సంఘటనలు జరిగాయి. తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.

బెంగళూరుకు రైలు ప్రయాణం కల్పించాలి

- జెవివి ఆధ్వర్యంలో సంతకాల సేకరణ.. అధికారులకు విన్నపం

సంతకాల సేకరణలో మాజీ ఎమ్మెల్సీ గేయానంద్, జెవివి ప్రతినిధులు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

కడప జిల్లా వాసులకు బెంగళూరు వెళ్లేందుకు రైలు ప్రయాణ సౌకర్యం కల్పించాలని జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మంగళవారం ఎర్రగుంట్లలో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు, మాజీ శాసనమండలి సభ్యులు డాక్టర్ గేయానంద్ మాట్లాడుతూ బెంగళూరుకు రైలు ఏర్పాటులో భాగంగా తిరుమల ఎక్స్‌ప్రెస్‌ను తాడిపత్రి వరకు పొడిగించాలని, ధర్మవరం ఎక్స్‌ప్రెస్ రైలును బెంగళూరు వరకు పొడిగించాలని కోరారు. వారంలో మూడు రోజులు కొండవీడు ఎక్స్‌ప్రెస్‌ను నంద్యాల-ప్రొద్దుటూరు-ఎర్రగుంట్ల-తాడిపత్రి-అనంతపురం మీదుగా బెంగళూరుకు నడపాలన్నారు. అనంతరం జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి బాలబయన్న మాట్లాడుతూ ఎర్రగుంట్ల రైల్వేస్టేషన్ పరిధిలో ప్రయాణికులకు సరిపడ మరుగుదొడ్లు లేక ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఫుట్ ఓవర్ బ్రిడ్జిని స్టేషన్ బయటి వరకు పొడిగించాలన్న డిమాండ్లతోపాటు సంతకాలతో కూడిన వినతిపత్రం రైల్వే అధికారులకు సమర్పించారు. కార్యక్రమంలో జెవివి రాష్ట్ర కమిటీ సభ్యులు ఎడి దేవదత్తం, రాజశేఖర్, మహేష్, మండల నాయకులు కెవి సుబ్బయ్య, రాంప్రసాద్ రెడ్డి, ఎస్ చాంద్‌బాషా, రాజు పాల్గొన్నారు.

అవినీతికి పాల్పడిన వారిపై క్రిమినల్ కేసు పెట్టాలి

ప్రజాశక్తి - ముద్దనూరు

గృహ నిర్మాణాల్లో అవినీతి, అక్రమాలకు పాల్పడి చేతివాటం ప్రదర్శించిన హౌసింగ్ ఎఇ, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌పై క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి.దస్తగిరిరెడ్డి, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ఆర్అండ్‌బి అతిథిగృహంలో వారు విలేకరులతో మాట్లాడుతూ సొంతింటి కలను సాకారం చేసుకోవాలనే ఆశతో పేదలు నిర్మించుకునే పక్కా ఇళ్ల నిర్మాణాల్లో అధికారులు అవినీతి అక్రమాలకు పాల్పడడం దారుణమన్నారు. ప్రభుత్వ నిబంధనలు పక్కనపెట్టి ఇల్లు నిర్మించని అనర్హులకు, పాత ఇళ్లకు బిల్లులు చేసి ఇసుక, సిమెంట్, కడ్డీలు మంజూరు చేయడం ఎఇ, ఇంజనీరింగ్ అసిస్టెంట్ అవినీతికి పరాకాష్ట అన్నారు. నిజమైన లబ్ధిదారులకు బిల్లులు, కడ్డీలు మంజూరు చేసేందుకు సిమెంట్, ఇసుక కూపన్లు ఇచ్చేందుకు వారి నుండి డబ్బులు డిమాండ్ చేసి వేధింపులకు గురి చేయడం బాధాకరమన్నారు. నకిలీ లబ్ధిదారులను పంపి సంతకాలు ఫోర్జరీ చేయించి ఇసుక, సిమెంట్, కడ్డీలు తరలించి బ్లాక్‌లో అమ్ముకోవడం అవమానకరమన్నారు. అవినీతి అక్రమాలపై తక్షణమే హౌసింగ్ పీడీ, కలెక్టర్ సమగ్ర విచారణ జరపాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం జమ్మలమడుగు నియోజకవర్గ కార్యదర్శి జి.ఏసుదాసు పాల్గొన్నారు.

- రాజకీయ వేధింపులు ఆపాలి : సిఐటియు

జిల్లాలోని అంగన్వాడీ వర్కర్ల పట్ల రాజకీయ వేధింపులు ఆపాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.మనోహర్ పేర్కొన్నారు. స్థానిక ఆర్అండ్‌బి అతిథిగృహంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పులివెందుల, కమలాపురం, జమ్మలమడుగు తదితర ప్రాంతాల్లోని అంగన్వాడీ వర్కర్లను రాజకీయంగా వేధించడం సరైంది కాదన్నారు. సింహాద్రిపురం, వేంపల్లి, వేముల, కమలాపురం, కొండాపురం, ముద్దనూరు మండలాల్లో అంగన్వాడీలను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అసెంబ్లీలో మాట్లాడుతూ ఎవరిపై కక్ష సాధింపులు చేయకూడదని ప్రకటించారని గుర్తు చేశారు. ఆ మాటలను కూడా గౌరవించకపోవడం బాధాకరమన్నారు. కొన్ని చోట్ల అంగన్వాడీ కేంద్రాలకు తాళాలు వేసి వర్కర్లను బయటకు వెళ్లాలని బెదిరింపులకు గురి చేయడం దారుణమన్నారు. ఇలాంటి సందర్భంలో సూపర్‌వైజర్లు, సిడిపిఒలపై వత్తిడి తేవడం వల్ల వారు ఆవేదనకు గురవుతున్నారని తెలిపారు. ఒత్తిడి తట్టుకోలేక అంగన్వాడీ వర్కర్లను వారు ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాజకీయ వేధింపులు ఆపాలన్నారు. చిన్నస్థాయి ఉద్యోగులను బాధించడం సరైంది కాదన్నారు. ఇలాగే కొనసాగితే జిల్లా వ్యాప్తంగా ఆందోళన చేస్తామని మనోహర్ హెచ్చరించారు.

జొన్నలో కత్తెర పురుగు నివారణకు చర్యలు

ప్రజాశక్తి - ముద్దనూరు

జొన్న పంటలో కత్తెర పురుగు నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని ముద్దనూరు వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు వెంకటసుబ్బయ్య రైతులకు సూచించారు. ముద్దనూరు మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని చెన్నారెడ్డిపల్లెలో మంగళవారం ఎడిఎ ఆధ్వర్యంలో వ్యవసాయ అధికారి వెంకటకృష్ణారెడ్డి పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జొన్నలో కత్తెర పురుగు నివారణకు ఇమామేక్టిన్ బెంజిట్ అనే మందును ఎకరానికి 100 గ్రాములు చొప్పున నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. పొలం గట్ల చుట్టూ వయ్యారి భామ అనే కలుపు మొక్క లేకుండా సమూలంగా నిర్మూలించాలని సూచించారు. పచ్చి మిరపకు ధర లేక కనీసం పెట్టిన పెట్టుబడులు కూడా రాలేదని ప్రభుత్వం తమను ఆదుకోవాలని పచ్చి మిరప రైతులు విన్నవించారు. కార్యక్రమంలో ఆత్మ బిటియం ఐ.రవికుమార్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

చాపాడు : వరి పంటలో నూతన యాజమాన్య పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించాలని ఎఒ మ్యాగీ సూచించారు. మంగళవారం మండల పరిధిలోని సోమాపురం, మొర్రాయపల్లె గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం మండల వ్యాప్తంగా 13 వేల ఎకరాల్లో వరి పంటను రైతులు సాగు చేశారన్నారు. యూరియాను అవసరం మేరకే వినియోగించాలన్నారు. వరిలో చీడపీడలు సోకుతున్నాయని, వ్యవసాయ శాఖ సిబ్బంది సలహా తప్పక పాటించాలన్నారు. అవసరమైతే కడప ఏరువాక శాస్త్రవేత్తలను పంట పొలాల పరిశీలనకు తీసుకొస్తామన్నారు. సర్పంచ్ శ్రీనివాసులరెడ్డి, టిడిపి నాయకులు సుబ్బారెడ్డి, విఎఎ పుష్పలత, రైతులు పాల్గొన్నారు.

చక్రాయపేట : మండలంలోని గొట్లమిట్ట గ్రామంలోమంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ అధికారి నవంత్‌బాబు కంది పంటను పరిశీలించి సస్యరక్షణపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉద్యాన సహాయకులు శివ లలిత, పశు వైద్య సహాయకులు చేతన, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వృద్ధుల బాగోగులు తెలుసుకుంటున్న జడ్జి ఎన్.లావణ్య

ఆశ్రమ శుభ్రత పట్ల జడ్జి హర్షం

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల : మండలంలోని తిప్పలూరు గ్రామ ఎద్దుల పెద్ద శేషమ్మ అనాథాశ్రమాన్ని కమలా పురం జడ్జి ఎన్.లావణ్య ఆకస్మిక తనిఖీ చేశారు. ఆశ్రమ గదులు, వంటగది, బాత్రూంలను పరి శీలించి, ఆశ్రమ శుభ్రత పట్ల సంతృప్తిని వ్యక్తం చేశారు. అనంతరం జడ్జి ఆశ్రమవాసులతో మాట్లాడుతూ ఆశ్రమాన్ని నిర్వహిస్తున్న నాగేంద్ర గురించి వాకబు చేయగా, ఆశ్రమవాసులు ఇచ్చిన సమాధానం పట్ల ఆమె సంతోషాన్ని వ్యక్తం చేశారు. అనంతరం వృద్ధుల బాగోగులను అడిగి తెలుసుకున్నారు. ఆశ్రమ నిర్వహణకు సలహా లిచ్చారు. ఆశ్రమంలో పెన్షన్ లేని వృద్ధుల వివరాలు తీసుకున్నారు. ఆశ్రమం అభివృద్ధికి సుప్రీం కోర్టుకు ప్రమోట్ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పుష్పరాజు, అభి ట్రస్ట్ చైర్మన్ ఎన్.విజయబాబు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

క్రమశిక్షణతో మానసిక వ్యాధులు దూరం

ప్రజాశక్తి - ఖాజీపేట : కమశిక్షణతో జీవిస్తే మానసిక వ్యాధులు దరిచేరవని వైద్యాధికారి ముబీన్ తెలిపారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినం సందర్భంగా డాక్టర్ ముబీన్ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మానసిక వైద్య నిపుణులు ఎన్.కవిత మాట్లాడుతూ అతిగా మాట్లాడడం, తనలో తాను నవ్వుకోవడం, మాట్లాడుకోవడం, అనుమానాలు, విపరీత ప్రవర్తన, నిద్రలేమి, అతినిద్ర, మతి మరుపు, మైగ్రేన్ వంటి తలనొప్పి, మానసిక ఒత్తిడి, నిరాశ, ఆత్మహత్యాయత్నం, అనవసరమైన భయాలు, గుండెదడ వంటి లక్షణాలు ఉన్న వారు చికిత్స తీసుకోవాలని సూచించారు. కార్యక్ర మంలో ఆరోగ్య విస్తరణ అధికారి బి.నాగ భూషణం, ఆశ నోడల్ ఆఫీసర్ అరుణకుమారి, సూపర్‌వైజర్ శోభన్‌బాబు, సబ్ యూనిట్ ఆఫీసర్ బి.నరసింహరెడ్డి, ఆశలు, ఆరోగ్య కార్యకర్తలు, క్లినికల్ సైకాలజిస్టులు రాధిక, శిల్పా, సైక్రియాట్రిక్ సోషల్ వర్కర్స్ పిల్లిభాస్కర్, ఎస్ సుమన్‌బాబు, కేస్ రిజిస్టర్ పవన్‌కుమార్‌రెడ్డి, ఎఎన్ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

టీకాలపై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి - వేంపల్లె

గర్భిణులు, బాలింతలు, పిల్లలకు వేసే టీకాలపై ఆశా కార్యకర్తలు ప్రజలకు అవగాహన కల్పించాలని అడిషనల్ డిఎంహెచ్ఒ డాక్టర్ ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. మంగళవారం ఆశా డే సందర్భంగా మండలంలోని తాళ్ళపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరిగే ఆశా కార్యకర్తలు సమావేశాన్ని అడిషనల్ డిఎంహెచ్ఒ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆశ కార్యకర్తలకు పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో సిహెచ్ఒ మునిరెడ్డి, వైద్యులు నిజాముద్దీన్, పృథ్వీ, హెల్త్ ఎడ్యుకేటర్ షఫీ ఉన్నిసా బేగం, ఎంఎహెచ్ఇఒ ఫక్రుద్దీన్, ఎంవివి ప్రసాద్, ఆశా, ఆరోగ్య కార్యకర్తలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే 'పుట్టా'

ప్రజాశక్తి - ఖాజీపేట

స్థానిక మెయిన్ బజార్‌లోని శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో స్థానిక కన్యకాపరమేశ్వరి అమ్మవారిని మంగళవారం ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

విధుల్లో చేరిన పంచాయతీ సెక్రటరీలు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండలవ్యాప్తంగా మూడు పంచాయతీల్లో పంచాయతీ సెక్రటరీలు బాధ్యతలు స్వీకరించినట్లు ఎంపీడీవో కృష్ణమూర్తి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మేజర్ పంచాయతీ అయినా సింహాద్రిపురానికి వెంకటరాముడు, కోరగుంటపల్లెకు రాజ్‌కుమార్, కాంపల్లెకు వెంకటసుబ్బారెడ్డి, సుంకేసుల సచివాలయం డిజిటల్ అసిస్టెంట్‌గా కల్యాణ్, అంకాలమ్మ గూడూరు విఆర్‌ఒగా అనుష, పైడిపాలెం, కోరగుంటపల్లె సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్‌గా కరిష్మా, వహీదా బాధ్యతలు చేపట్టారు. సింహాద్రిపురం మేజర్ పంచాయతీ సెక్రెటరీగా పనిచేసిన హరికిషోర్ లింగాల మండలానికి, సింహాద్రిపురం విలేజ్ సర్వేయర్ వాణి ముత్యాను వేంపల్లెకు ఉన్నత అధికారులు బదిలీ చేసినట్లు ఎంపీడీవో తెలిపారు.

ఖోఖో పోటీలకు ఎస్ఆర్ఐటి విద్యార్థులు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ఖోఖోలో ఎస్ఆర్ఐటి విద్యార్థుల మంచి ప్రతిభ కనబరిచారని, సౌత్‌జోన్ పోటీలకు ఎంపికయ్యారని ఆ కళాశాల ప్రిన్సిపల్ పాండురంగన్ రవి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల్లూరు ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన సౌత్‌జోన్ ఖోఖో ఎంపిక పోటీల్లో జెఎన్టీయూఏ అనంతపురం యూనివర్సిటీ టీంకు ఎస్ఆర్ఐటిలో నాలుగవ సంవత్సరం బీటెక్ విద్యార్థి బి.సురేష్, రెండవ సంత్సరం బిటెక్ విద్యార్థిని జి.ప్రశాంతి ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ బసిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, వైస్ చైర్మన్ వీరకుమార్ రెడ్డి, కరస్పాండెంట్ వీర కల్యాణ్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

ఆక్రమిత ప్రభుత్వ స్థలాలను గుర్తించాలి

ప్రజాశక్తి - మైదుకూరు(చాపాడు)

మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలాలను గుర్తించి నివేదిక ఇవ్వాలని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ అధికారులకు సూచించారు. మంగళవారం మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర అధ్యక్షతన మున్సిపల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మునిసిపల్ చైర్మన్ మాట్లాడుతూ మున్సిపల్ కార్యాలయ ఆవరణలో రిజిస్టర్ కార్యాలయాన్ని ఏర్పాటు చేసేలా ఎమ్మెల్యే చర్యలు తీసుకున్నారని, మున్సిపల్ ఆదాయం ఎలా వస్తుందని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. అలాగే పలు ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురయ్యాయని, వాటిపై దృష్టి సారించాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మున్సిపల్ కార్యాలయానికి రిజిస్టర్ కార్యాలయం వారు అద్దె చెల్లిస్తారని తెలిపారు. ప్రభుత్వ స్థలాలు చాలా వరకు ఆక్రమణకు గురైనట్లు తన దృష్టికి కూడా వచ్చిందన్నారు. మూడు నెలల లోపు ఆక్రమణకు గురైన స్థలాలను గుర్తించి నివేదిక ఇవ్వాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. నివేదిక వచ్చిన తర్వాత కౌన్సిలర్ల సమావేశంలో ఒక నిర్ణయానికి వచ్చి చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులరెడ్డి, అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

రిటైర్డ్ వ్యవసాయ శాఖ అధికారి మృతి

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండలంలోని వై.కొత్తపల్లెకు చెందిన రిటైర్డ్ వ్యవసాయ శాఖ అధికారి రవీంద్రనాథ్‌రెడ్డి(82) మంగళవారం ఆయన స్వగృహంలో అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన పులివెందుల మాజీ శాసనసభ్యుడు చవ్వా బాల్‌రెడ్డి రెండవ కుమారుడు. మృతుడికి భార్య విజయలక్ష్మి, ఇద్దరు కుమారులు, ఒక్క కుమార్తె ఉన్నారు. రవీంద్రనాథ్‌రెడ్డి మృతదేహాన్ని పలువురు ప్రముఖులు సందర్శించి, నివాళులు అర్పించారు.

ఉచిత ప్రవేశం కల్పించాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ప్రొద్దుటూరులో నిర్వహిస్తున్న ఎగ్జిబిషన్‌లో ధరలను నియంత్రించి, ఉచిత ప్రవేశం కల్పించాలని విద్యార్థి యువజన సంఘాలు పిఎస్‌వైఎఫ్, ఆర్ఎస్ఒ నాయకులు కోరారు. ఆ మేరకు వారు రెవెన్యూ కార్యాలయం వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ గంగయ్యకు వినతిపత్రమిచ్చారు. కార్యక్రమంలో విద్యార్థి యువజన నాయకులు ఓబులేసు, జగన్, లింగమయ్య పాల్గొన్నారు.

ఫిర్యాదుల్లేని సేవలే లక్ష్యంగా పనిచేయాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా విషయంలో.. ఫిర్యాదుల్లేని సేవలే లక్ష్యంగా పని చేయాలని ఉమ్మడి కడప జిల్లా విద్యుత్ ఎస్‌సి రమణ సిబ్బందికి సూచించారు. ప్రొద్దుటూరు విద్యుత్ డివిజన్ పరిధిలోని మండలాల క్షేత్రస్థాయి అధికారులతో స్థానిక కార్యాలయంలో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇళ్ల విద్యుత్ బిల్లులు తగ్గించేందుకు సూర్య ఘర్ యోజన పథకం గురించి ప్రజలకు వివరించి చెప్పాలన్నారు. ఇందుకు బ్యాంకు రుణాలు అందుతాయన్నారు. ఉద్యోగులు కేటాయించిన ప్రాంతంలో నివాసం ఉంటే ఆశించిన స్థాయిలో ఫలితాలు వస్తాయన్నారు. విద్యుత్ బకాయిలు లేకుండా చూడాలన్నారు. మొండి బకాయిలు ఉన్నవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. లో ఓల్టేజ్ సమస్యలు రాకుండా చూడాలని ఆదేశించారు. విద్యుత్ చౌర్యాన్ని అరికట్టాలన్నారు. సమస్యల్ని ఎప్పటికప్పుడు సరి చేసుకోవాలని తెలిపారు. సమావేశంలో ఇఇ రమణారెడ్డి, డిప్యూటీ ఇఇలు, ఎఇలు, జెఇలు పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న ఎస్‌సి రమణ

ప్రశంసాపత్రం అందుకుంటున్న విద్యార్థి తవ్వా నవ్య

క్విజ్ పోటీల్లో రెయిన్‌బో పాఠశాల ప్రథమం

ప్రజాశక్తి - ఖాజీపేట

ఇటీవల శ్రీహరికోట సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్) వారి ఆధ్వర్యంలో కడప కెఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాలలో మండలస్థాయిలో నిర్వహించిన క్విజ్ పోటీల్లో స్థానిక రెయిన్ బో పాఠశాల పదవ తరగతి విద్యార్థి తవ్వా నవ్య ప్రథమ బహుమతి సాధించిందని ఆ పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ తవ్వా సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఈ క్విజ్ పోటీలు 8,9,10 తరగతుల విద్యార్థులకు నిర్వహించారు. ప్రథమ బహుమతి గెలుచుకున్న తవ్వా నవ్యకు షార్ డైరెక్టర్ రాజరాజన్, జిల్లా విద్యాశాఖ అధికారి అనూరాధ చేతుల మీదుగా బహుమతి, ప్రశంసాపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంగళవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో విజేత తవ్వా నవ్యను పాఠశాల యాజ మాన్యం అభినందించింది. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మండల స్థాయిలో విజేతలకు బహుమతులు

ప్రజాశక్తి - ముద్దనూరు

వరల్డ్ స్పేస్ వీక్-2024 సందర్భంగా గతనెల 27న విద్యార్థులకు మండలస్థాయిలో పోటీలు నిర్వహించారు. విజేతలైన ముద్దనూరు బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు వెంకట కిరణ్, మేఘన, కవితకు కడపలోని కెఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాలలో కడప విద్యాశాఖ అధికారి అనురాధ బహుమతులు, సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు కుండా భాస్కర్ పాల్గొన్నారు.

నేడు ఖాజీపేట మండల సమావేశం

ప్రజాశక్తి - ఖాజీపేట

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలోని సభా భవనంలో బుధవారం మధ్యాహ్నం ఎంపిపి అబూబకర్ సిద్దిక్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నామని ఎంపిడిఒ వెంకటరమణ తెలిపారు. సమావేశానికి ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ హాజరవుతారని పేర్కొన్నారు. అన్ని శాఖల అధికారులు తమ పూర్తి నివేదికలతో తప్పక హాజరుకావాలన్నారు.

పులివెందుల రైతులకు కెవికె శనగ విత్తనాలు

ప్రజాశక్తి - మైదుకూరు(చాపాడు)

మైదుకూరు మండలం వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రం తరపున పులివెందుల ప్రాంత రైతులకు మంగళవారం శనగ విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కెవికె సీనియర్ శాస్త్రవేత్త డాక్టర బాలకృష్ణ మాట్లాడుతూ ఎన్ఆర్ జి-452, ఎన్ఈఈజీ-776 శనగ విత్తనాలను పంపిణీ చేశామన్నారు. విత్తనశుద్ధి, విత్తన మోతాదు, దుక్కిలో తీసుకోవలసిన మెలకువల గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ ఎన్.శ్రీవిద్యారాణి, ఆదర్శరైతు బిపి ప్రతాప్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

జమిలి ఎన్నికల ప్రస్తావన పిచ్చి తుగ్లక్ నిర్ణయం

- పిసిసి రాష్ట్ర అధికార ప్రతినిధి ఎన్.తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

దేశవ్యాపంగా అన్ని ఎన్నికలు ఒకేసారి (జమిలి) నిర్వహించాలనే ప్రస్తావన పిచ్చి తుగ్లక్ నిర్ణయమని పిసిసి రాష్ట్ర ముఖ్య అధికారి ప్రతినిధి ఎన్.తులసిరెడ్డి విమర్శించారు. స్థానికంగా మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రధాని మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న జమిలి ఎన్నికల నిర్ణయం అసాధ్యం, ఆచరణ సాధ్యంకాదన్నారు. జమిలి ఎన్నికలు జరగాలంటే 18 రాజ్యాంగ సవరణలు చేయాలన్నారు. అలా చేయాలంటే లోక్‌సభలో, రాజ్యసభలో మూడింట రెండు వంతుల మెజారిటీ ఉండాలన్నారు. లోక్‌సభ సభ్యుల మొత్తం సంఖ్య 543 ఉండగా మూడింట రెండు వంతుల మెజార్టీ కేంద్రంలో ఉన్న ప్రభుత్వానికి 362 సంఖ్య బలం ఉండాలని చెప్పారు. ప్రస్తుతం ఎన్‌డిఎ సభ్యుల సంఖ్య 293 మాత్రమేనని తెలిపారు. రాజ్యసభ సభ్యుల మొత్తం సంఖ్య 245 ఉన్నారని.. వీరిలో మూడింట రెండు వంతులు 164 సభ్యులు ఉండాలన్నారు. ప్రస్తుతం ఎన్‌డిఎ బలం 121 మాత్రమే ఉంద న్నారు. ఎన్నికల ఖర్చు తగ్గించడం కోసమే జమిలి ఎన్నికలు అనడంలో అర్థం లేదన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అభివృద్ధికి అడ్డు వస్తుందని, అందుకే జమిలి ఎన్నికలు అని చెప్పడంలో కూడా హేతుబద్ధత లేదన్నారు. జమిలి ఎన్ని కలు అవినీతికి, నియంతృత్వానికి దారి తీస్తాయని వివరించారు. ఇప్పటికైనా జమిలి ఎన్నికల నిర్ణయాన్ని మోడీ ప్రభుత్వం విరమించుకోవాలని తులసిరెడ్డి కోరారు.

ఇండియా కూటమి విజయం హర్షణీయం

దేశానికి మకుటమైన జమ్మూకశ్మీర్‌లో ప్రతిష్టాత్మకంగా జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ కూటమి విజయం సాధించడం హర్షణీయమని పిసిసి రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. జమ్మూకశ్మీర్ ఎన్నికల్లో ఇండియా కూటమి విజయం సాధించిన సందర్భంగా మంగళవారం వేంపల్లెలో కాంగ్రెస్ నాయకులు సంబరాలు చేసుకొని మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సుబ్రమణ్యం, రామకృష్ణ, అమర్నాథ్‌రెడ్డి, ఉత్తన్న, వెంకటేష్, నాగరాజు, రమణ, బద్రి, రవి పాల్గొన్నారు.

తప్పిన పెను ప్రమాదం

ప్రజాశక్తి - ఖాజీపేట

మండలం పరిధిలోని రావులపల్లె గ్రామ సమీపంలో మంగళవారం ఓ భారీ వృక్షం నేలకొరిగి విద్యుత్ తీగలపై పడడంతో స్తంభం విరిగింది. విద్యుత్ తీగెలు నేలపై పడ్డాయి. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. గ్రామాల మధ్య రాకపోకులకు అంతరాయం కలిగింది. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగడంతో ప్రజలకు ఇబ్బందులు ఎదురయ్యాయి. ఈ విషయాన్ని స్థానికులు సంబంధిత అధికారులు దృష్టికి తీసుకెళ్లగా వారు స్పందించారు. పలుచోట్ల విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయని, వాటిని సరి చేయాలని గ్రామస్తులు కోరారు.

నిత్యాన్నదానానికి విరాళం

ప్రజాశక్తి - చక్రాయపేట

ప్రముఖ పుణ్యక్షేత్రమైన గండిక్షేత్రం శ్రీ వీరాంజనేయస్వామి వారి శాశ్వత నిత్యాన్నదాన పథకానికి మంగళవారం దువ్వూరు మండలం భీమునిపాడు గ్రామానికి చెందిన సంజీవరెడ్డి కుమారుడు రామానుజులరెడ్డి రూ.1,00,116 విరాళాన్ని సమర్పించారని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వెంకటసుబ్బయ్య తెలిపారు. వారికి ఆలయ ప్రధాన అర్చకులు కేసరి స్వామి ప్రత్యేక దర్శనం చేయించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. శేషవస్త్రం, స్వామి వారి చిత్రాపటాన్ని అందజేసి వేద ఆశీర్వచనం చేశారు. ఈ సందర్భంగా దాతలు మాట్లాడుతూ స్వామి వారి దర్శనార్థం వచ్చే భక్తులకు నిత్యాన్నదానం ఏర్పాటు చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఆలయ అర్చక బృందం, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతపై అవగాహన

ముద్దనూరు : పరిసరాలు,శుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని పిహెచ్‌సి వైద్యాధికారి కరిష్మా తెలిపారు. మండల కేంద్రంలోని ఎస్వీ గిరి కాలనీకి చెందిన జగన్నాథ్‌కు డెంగ్యూ వ్యాధి లక్షణాలున్నట్లు నిర్ధారణ అయ్యిందని ఆమె తెలిపారు. స్థానిక పిహెచ్‌సిలో ల్యాబ్ టెక్నీషియన్ జాసన్ జగన్నాథ్‌కు రక్త పరీక్షలు చేశామన్నారు. కడప రిమ్స్ ఆస్పత్రికి రెఫర్ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు భారతి, నీలవేణి, సంధ్య, విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఆర్‌జెడిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ఇంటర్మీడియట్ జోన్-4 ఆర్‌జెడిపై చర్యలు తీసుకోవాలని పిఎస్‌వైఎస్ విద్యార్థి యువజన సంఘం రాష్ట్ర కన్వీనర్ కత్తి ఓబులేసు మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మ్యూచువల్ బదిలీల్లో టైపిస్టు, జూనియర్ అసిస్టెంట్ నుండి కాంట్రాక్టు లెక్చరర్ల వరకు ఎయిడెడ్ లెక్చరర్ కలుపుకొని బదిలీల్లో రాయలసీమ వ్యాప్తంగా లంచాలు తీసుకుని అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. గతంలో కడప జిల్లా ఆర్ఐఒగా ఉన్నప్పుడు ఆయనపై అనేక ఆరోపణలు వచ్చాయన్నారు. అప్పట్లో ఆయనను తొలగించిన విషయం గుర్తు చేశారు. ఆయన అవినీతిని మంత్రి నారా లోకేష్, ఇంటర్మీడియట్ కమిషనర్ శుక్లా దృష్టికి తీసుకెళ్తామని ఓబులేసు ఆ ప్రకటనలో తెలిపారు.